
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం । 15 । జూలై । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 25.893 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 90.343 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) -	రూ.61,180
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,494
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,659
నవర (8 గ్రా) -	రూ.45,272

గరిష్ఠం/కనిష్ఠం
37.6 /27.0

వాతావరణం

జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గాలిలో 49 శాతం తేమ ఉందని వాతావరణశాఖ ప్రకటించింది.

న్యూస్‌రీల్

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో మూడు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి జరుగుతున్నట్టు ప్రాజెక్ట్ ఇంజినీర్లు శుక్రవారం తెలిపారు. ఇందులో భాగంగా 1వ యూనిట్‌లో 490 మెగావాట్లు, 2వ యూనిట్‌లో 425 మెగావాట్లు, 3వ యూనిట్‌లో 570 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు తెలిపారు.

మెనూ అమలులో రాజీలేదు



బీసీ బాలుర వసతిగృహంలో సమస్యలపై ఆరా తీస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్

దుత్తలూరు: విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ పాటించకపోతే క్రిమినల్ కేసులు నమోదుచేయడంతోపాటు బాధ్యులను సస్పెండ్ చేస్తామని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. దుత్తలూరులోని బీసీ బాలుర వసతిగృహం, ఏపీ ఆదర్శ పాఠశాల, బీసీకాలనీ, పూసలకాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొత్త మెనూ అమలులోకొచ్చినా ఏపీ ఆదర్శ పాఠశాలలో పాత మెనూనే అమలు చేస్తుండడంతో ప్రిన్సిపల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని సూచించారు. అనంతరం మారిన మెనూను విద్యార్థులకు చదివి వినిపించారు. అంతకుముందు బీసీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన, కావలి డిప్యూటీ డీఈఓ హరిప్రసాద్, తహసీల్దార్ సోమ్లానాయక్, ఎంపీడీఓ సాయిప్రసాద్, ఎంఈఓ వెంగయ్య, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

17న జాబ్‌మేళా


నెల్లూరు(మినీబైపాస్): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.వి.రామాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడరన్ వీర్ రేస్ సెక్యూరిటీ ఫోర్స్, కృష్ణపట్నం పోర్టు, అపోలో ఫార్మసీ లిమిటెడ్, నాయుడుపేటలో ఏపీఎల్ హెల్త్ కేర్ యూనిట్(అరబిందో ఫార్మా లిమిటెడ్) కంపెనీల్లో కంప్యూటర్ ఆపరేటర్స్, సెక్యూరిటీ గార్డ్స్, ట్రైనీ ఆపరేటర్స్ ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 17న ఉదయం 10 గంటలకు స్థానిక ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు.

ఇంటికో నలభీముడు



వేగూరులో 120కి పైగా క్యాటరింగ్ కేంద్రాలు

- జిల్లాలో తొలి క్యాటరింగ్ ఇక్కడి నుంచే ప్రారంభం
- 30 రకాలకు పైగా వంటకాల తయారీ
- ఒక్కో క్యాటరింగ్‌లో 30 మందికి ఉపాధి



వేగూరు గ్రామ వ్యూ

ఒక్క ఆలోచన ఎందరికో దారి చూపింది. ఒక ఆసక్తి మరెందరో ఉపాధికి బాటలు వేసింది. వంటల తయారీలో చేయి తిరిగిన నైపుణ్యం చైతన్యం తెచ్చింది. అటు పేరుకు పేరు.. ఇటు ఆర్థిక తోడ్పాటు అంతేనా.. జిల్లాలోనే తొలి క్యాటరింగ్ ఏర్పాటుకూ బీజం వేసింది. తద్వారా ఇంటికో నలభీముడు తయారు కాగా రుచికరమైన వంటలకు వేగూరు కేరాఫ్‌గా నిలిచింది. అక్కడి వంటగాళ్లకు తిరుగులేదనే పేరును తీసుకువచ్చింది. ఆ కీర్తి విదేశాలకూ పాకింది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కోవూరు మండలం వేగూరు గ్రామానికి చెందిన వంటల సుబ్బయ్య చిన్నతనంలో మోడేగుంటకు చెందిన దేవెళ్ల సుబ్బరామిరెడ్డి అనే భూస్వామి వద్ద పశువుల కాపరిగా చేరారు. ఆ రోజుల్లో ఆయన ఇంట్లో కుటుంబసభ్యులు పనివాళ్లతో కలిపి సుమారు 60 నుంచి 70 మంది ఉండేవారు. వారందరికీ వంట చేయడం ఆ ఇంటి ఇల్లాలు తులశమ్మకు కష్టమైంది. దీంతో సుబ్బయ్యను వంట పనులకు సహాయకారిగా నియమించుకోగా ఆమె వద్ద వంట చేయడంలో మెళకువలు నేర్చుకున్నారు. ఆయనే చేసిన వంటల రుచులు నచ్చడం, ఆ మేరకు పేరు రావడంతో ఎంతోమంది పేరున్నోళ్లు ఆ రోజుల్లోనే తమ ఇళ్లలో జరిగే శుభకార్యాలకు వంట చేసేందుకు సుబ్బయ్యను తీసుకెళ్లేవారు. షావుకారు కుటుంబాలు క్రమంగా నగరాలకు వెళ్లిపోగా సుబ్బయ్య మాత్రం స్వగ్రామం వేగూరులోనే ఉండిపోయారు.

30 రకాల వంటలు

వేగూరులో తమ స్వగృహాల సముదాయాల్లోనే వంటలు తయారు చేసి జిల్లా నలుమూలలకు వాహనాల్లో పంపడం ఇక్కడి ప్రత్యేకత. శాఖాహార, మాంసాహార వంటలతోపాటు బిరియానీ, పాయ, చిల్లీ చికెన్, మటన్ బిరియానీ, వడ, పాయసం, జాంగ్రీ, లడ్డూ తదితర సుమారు 30 రకాల వంటలను తయారు చేయడంలో ఇక్కడి నలభీములు సిద్ధహస్తులు.



ప్రముఖుల ఇళ్లలోనూ..

జిల్లాకు చెందిన మాజీ సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాగుంట సుబ్బరామిరెడ్డి, నెల్లూరు నర్తకీ సినిమా హాలు యజమానులు గుండా రాజమ్మ, ఆనం కుటుంబీకులు ఇలా పలువురు ప్రముఖులు వారి ఇళ్లలో జరిగే కార్యక్రమాలకు వంటలు చేసేందుకు సుబ్బయ్యనే పిలిపించుకునేవారని ఆ గ్రామస్తులు చెబుతుంటారు. అంతేకాదు ఆయనతో వంటలు చేయించుకుని అప్పట్లోనే అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్ దేశాల్లో ఉన్న తమ వారి కోసం తీసుకువెళ్లేవారని చెబుతున్నారు.



వంట సిద్ధం చేస్తున్న యువకులు (ఫైల్)

తొలి క్యాటరింగ్ కేంద్రం

జిల్లాలో తొలి క్యాటరింగ్ వేగూరు గ్రామం నుంచే ప్రారంభమైంది. వంటల సుబ్బయ్య వద్ద సహాయకారిగా ఉన్న పసుపులేటి వెంకటసుబ్బయ్య ఇళ్లలో, హోటళ్లలో వంటలు చేయడం ద్వారా వేగూరు వంటగాళ్లకు పేరొచ్చినా ఆదాయం అరకొరగానే ఉండేది. దీంతో ఆలోచనలో పడ్డారు. వచ్చిన పనినే నమ్ముకుని ఆదాయం పెంచుకునేందుకు పాతికేళ్ల క్రితం సొంతంగా గ్రామంలోనే క్యాటరింగ్ ప్రారంభించారు. అనతి కాలంలోనే ఆదాయం పెరగ్గా.. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ఎంతోమంది యువత అదేబాట పట్టారు. ప్రస్తుతం గ్రామంలో సుమారు 120 క్యాటరింగ్ కేంద్రాలు నిర్వహిస్తుండగా ఒక్కో కేంద్రంలో 10 నుంచి 30 మంది వరకు ఉపాధి పొందుతున్నారు. ఈ ఊరి యువత కొందరు చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, ముంబై, హైదరాబాద్ తదితర నగరాల్లో కూడా క్యాటరింగ్ కేంద్రాలు, హోటళ్లను ఏర్పాటు చేసుకుని రాణిస్తున్నారు.

ఆసక్తితోనే ఈ వృత్తిలోకి..



వేగూరు వంటకాలు ఎంతో ప్రత్యేకం. వేగూరులో వంట నేర్చుకున్న ఎంతోమంది చేయితిరిగిన వంటమాస్టర్లు దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లి కూడా నెల్లూరు భోజనాన్ని రుచిచూపించి ప్రశంసలందుకున్నారు. నాకు వంటలపై ఆసక్తి ఉండడం వల్లనే వేగూరులో వంటలు నేర్చుకుంటున్నా. అందుకే ఈ వృత్తిలోకి వచ్చా.

– బి.వెంకన్నబాబు, నెల్లూరు

వంటకమంటేనే వేగూరు



జిల్లాలో అనేక గ్రామాల్లో వంటలు తయారవుతున్నాయి. అయితే వంటకమంటే గుర్తొచ్చే మొదటి ఊరు వేగూరు. సాధారణ స్థాయి నుంచి కార్పొరేట్ స్థాయి వరకు ఏ వంటకం కావాలన్న వారి అభిరుచులకు తగినట్లు తయారు చేయడంలో ఇక్కడి వారు సిద్ధహస్తులు. మా గ్రామంలోని క్యాటరింగ్ కేంద్రాల ద్వారా వందలాది మంది ఉపాధి పొందుతున్నారు.

– రవికుమార్, వేగూరు

ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగవంతం

- కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల కింద చేపట్టిన నూతన గ్రామ, వార్డు సచివాలయ భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను నిర్ణీత గడువు లోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి శుక్రవారం ఉదయం వెలగపూడి సచివాలయం నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాల పురోగతి, వైద్య ఆరోగ్యశాఖ, జగనన్న విద్యాకానుక, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, నాడు-నేడు, స్త్రీశిశు సంక్షేమం, జగనన్నకు చెబుదాం, ఆడుదాం ఆంధ్ర తదితర అంశాలపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హరినారాయణన్ పాల్గొని జిల్లాలో ప్రభుత్వ భవనాల నిర్మాణాల పురోగతిని వివరిస్తూ నిర్ణీత గడువు లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు సీఎస్‌కు వివరించారు. అలాగే గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో ప్రకారం బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండేలా చర్యలు చేపడుతున్నామని, గత రెండు రోజులుగా సచివాలయాలు, పాఠశాలలను తనిఖీ చేసి బడికి రాని విద్యార్థుల వివరాలను వలంటీర్ల సర్వే ద్వారా తెలుసుకుని వారంతా బడికి వచ్చేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, పంచాయతీ రాజ్ ఎస్ఈ అశోక్‌కుమార్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఈఓ గంగాభవాని, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, సీపీఓ ఎస్.రాజు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

మైనింగ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

మనుబోలు: మండలంలోని వడ్లపూడి గ్రామ సమీపంలో మైనింగ్ ప్రాజెక్ట్ నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ శుక్రవారం గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు. మైనింగ్ ప్రాజెక్ట్ పనుల నిర్వహణ వల్ల పర్యావరణానికి గానీ, ప్రజలకు గాని ఏదైనా ఇబ్బంది ఉందా అని ఆరా తీశారు. వడ్లపూడి గ్రామం సమీపంలోని సర్వే నంబర్ 1080-1ఏలో 1.093 హెక్టార్ల భూమిలో ఏడాదికి 4,895 క్యూబిక్ మీటర్ల రోడ్డు మెటల్, 7,589 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ సేకరించనున్నారు. కార్యక్రమంలో మైనింగ్ శాఖ ఈఈ రాజశేఖర్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శివకృష్ణయ్య, డీటీ శ్రీకాంత్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ ప్రసాద్, సీఐ సంగమేశ్వరరావు పాల్గొన్నారు.

రొట్టెల పండగను విజయవంతం చేద్దాం

- బారాషహీద్‌దర్గాలో ఈ నెల 29 నుంచి ఆగస్టు 2 వరకు నిర్వహణ
- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి



బారాషహీద్ సమాధుల వద్ద ప్రత్యేక దువా చేస్తున్న ఎంపీ ఆదాల

నెల్లూరు(బృందావనం): బారాషహీద్‌దర్గా వద్ద రొట్టెల పండగను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 29 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఐదు రోజులపాటు జరగనున్న రొట్టెల పండగకు సంబంధించి స్థానిక బారాషహీద్‌దర్గా వద్ద వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, మైనార్టీ నాయకులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రొట్టెల పండగ ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ వికాస్‌మర్మత్ ఆధ్వర్యంలో ఇతర అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. భక్తుల కోసం ఇప్పటికే అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సమాయత్తమయ్యారన్నారు. రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖల అధికారులు ఏర్పాట్లపై దృష్టి పెట్టాలన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి దర్గా ప్రాంగణంలో ఏర్పాట్లు ప్రారంభమతాయన్నారు. మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్ మాట్లాడుతూ రొట్టెల పండగ నిర్వహణకు మున్సిపల్‌శాఖ నుంచి రూ.2.8 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మైనార్టీ నేతలు పలు సూచనలు, సలహాలు అందజేశారు. తొలుత ఆదాల ప్రభాకర్‌రెడ్డి బారాషహీద్‌ల సమాధులను దర్శించుకుని చాదర్లు సమర్పించి ప్రత్యేక దువా చేశారు. దర్గా పరిసరాలను పరిశీలించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మైనార్టీ నేతలు, కార్పొరేటర్లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా రొట్టెల పండగ

నెల్లూరు(దర్గామిట్ట): బారాషహీద్ దర్గా వద్ద నిర్వహించే రొట్టెల పండగను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 29 నుంచి జరగనున్న రొట్టెల పండగ ఏర్పాట్లపై శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ వీసీ హాలులో కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వికాస్‌మర్మత్, అధికారులతో ఎంపీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరు రైల్వేస్టేషన్ నుంచి దర్గా వరకు ఆర్టీసీ బస్సులు నడపాలని, వర్షం వస్తే ఇబ్బంది లేకుండా దర్గా సమీపంలోని కళ్యాణ మండపాలను ముందుగా సిద్ధం చేసుకోవాలని తెలిపారు. కలెక్టర్ ఎం.హరినారాయణన్ మాట్లాడుతూ అధికారులందరూ వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పార్కింగ్, దారి మళ్లింపు, ప్రత్యామ్నాయ మార్గాలను ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి మాట్లాడుతూ భక్తుల దర్శనానికి, శాంతి భద్రతలకు ఇబ్బందులు లేకుండా, వీఐపీలకు ప్రత్యేక ప్రవేశమార్గాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వికాస్, డీఆర్‌ఓ వెంకటనారాయణమ్మ, అడిషనల్ ఎస్పీ హిమవతి, ఆర్డీఓ మలోల, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నిర్మలాదేవి తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


జాబిలితో చెప్పనా!



నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళుతున్న ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్

నిప్పులు చిమ్ముతూ.. మబ్బులు చీల్చుకుంటూ.. జాబిలి వైపు దూసుకెళ్లిన చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతంతో స్థానికులు సంబరాల్లో మునిగితేలారు. ఈలలేస్తూ చప్పట్లతో సాగనంపారు. జెండాలూపుతూ విజయగర్వంతో ఊగిపోయారు. నింగిలో కనిపిస్తున్నంత సేపు మునివేళ్లపై నిలబడి తీక్షణంగా చూస్తూ నిలబడిపోయారు. కొందరు బైనాక్యులర్లతో చూసి ఆనంద సాగరంలో మునిగితేలారు. మరికొందరు తమ సెల్‌ఫోన్లలో బంధించి మురిసిపోయారు. నెలరాజుపై సాఫీగా దిగి.. నిగూఢ రహస్యాలు ఛేదించాలని ఆకాంక్షించారు.

- చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం
- భూకక్ష్యలోకి చేరిన ఉపగ్రహాలు
- ఉత్కంఠగా ఎదురు చూసిన స్థానికులు
- ప్రేక్షకులతో నిండిపోయిన గ్యాలరీలు
- శాస్త్రవేత్తలకు వెల్లువెత్తిన అభినందనలు



ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ ఎస్-200 ఘన ఇంధన స్ట్రాపాన్ బూస్టర్ల సాయంతో నింగివైపునకు దూసుకెళుతున్న దృశ్యం

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగవేదిక నుంచి శుక్రవారం మధ్యాహ్నం 2.35 గంటలకు ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ ద్వారా చంద్రయాన్-3 మిషన్‌ను విజయవంతంగా ప్రయోగించారు. ఈప్రయోగం పూర్తిస్థాయిలోవిజయం సాధించాలంటే ఆగస్టు 23 దాకా వేచి చూడాల్సి ఉన్నప్పటికీ ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ 3,920 కిలోల బరువు కలిగిన చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని నిర్ణీత సమయంలో నిర్దేశిత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టి మొదటి దశ విజయాన్ని అందుకున్నారు.

మూడు దశల రాకెట్ ప్రయాణం ఇలా..


ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ 43.43 పొడవు కలిగి 640 టన్నుల బరువుతో శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి నింగిలోకి నిప్పులు చిమ్ముకుండూ మూడు దశలను ఛేదిస్తూ విజయవంతంగా దూసుకెళ్లింది.

చంద్రయాన్-3 ఉపగ్రహంలో 2,145 కిలోల బరువు కలిగిన ప్రొపల్షన్ మాడ్యూల్, 1,749 కిలోల బరువు కలిగిన ల్యాండర్, 26 కిలోల బరువు కలిగిన రోవర్‌లను చందమామపై పరిశోధనలకు విజయవంతంగా పంపించారు. ఇందులో ఆరు ఇండియన్ పేలోడ్స్‌తో పాటు ఆమెరికా నాసాకు చెందిన ఒక పేలోడ్‌ను పంపించారు.

- మొదటి దశలో ఇరువైపులా అత్యంత శక్తివంతమైన ఎస్-200 బూస్టర్లు సాయంతో నింగికి పయనమై రెండు స్ట్రాపాన్ బూస్టర్లులో 400 టన్నుల ఘన ఇంధనం సాయంతో 127 సెకండ్లలో మొదటి దశ పూర్తి చేశారు.
- రెండో దశలో ఎల్-110 అంటే 110 టన్నుల ద్రవ ఇంధనాన్ని ఉపయోగించి 305.56 సెకండ్లకు రెండో దశను పూర్తి చేశారు.
- ఈ మధ్యలో 194.96 సెకండ్లకు రాకెట్ శిఖరభాగాన చంద్రయాన్-3 మిషన్‌కు రెండువైపులా అమర్చిన హీట్‌షీల్డ్స్ విడిపోయాయి.
- మూడోదశలో 958.71 సెకండ్లకు 25 టన్నుల క్రయోజనిక్ ఇంధనాన్ని వినియోగించి 954.42 సెకండ్లకు కటాఫ్ చేశారు.
- రాకెట్‌కు శిఖరభాగాన అమర్చిన త్రీ-ఇన్-వన్ మిషన్ చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని భూమికి దూరంగా (అపోజి) 36,500 కిలోమీటర్ల ఎత్తులో హైలీ ఎసిన్‌ట్రిక్ అర్బిట్(అత్యంత విపరీతమైన కక్ష్య)లోకి ప్రవేశపెట్టి చరిత్రాత్మకమైన విజయాన్ని నమోదు చేశారు.

చప్పట్లతో మార్మోగిన గ్యాలరీలు

సతీష్ ధవన్ స్పేస్‌సెంటర్ షార్ నుంచి శుక్రవారం మధ్యాహ్నం 2.35 గంటలకు ప్రయోగించిన ఎల్‌వీఎం3-ఎం4 ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుంచే కాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు పది వేల మందిదాకా విచ్చేశారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు కార్లు, స్కూల్ వ్యాన్‌లు, బస్సులు బారులు తీరాయి. అయితే షార్ కేంద్రం వారు మాత్రం ప్రతి రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు అనువుగా శ్రీహరికోటలోనే ఒక ప్రత్యేక గాలరీని ఏర్పాటు చేశారు. జమ్ము కశ్మీర్ నుంచి కూడా వీక్షకులు తరలివచ్చారు. రాకెట్ ప్రయోగాన్ని వీక్షించాలనుకునే వారితో పులికాట్ సరస్సులోని రోడ్డు కిక్కిరిసింది. రాకెట్ నింగికేగుతున్న సమయంలో వారంతా కొట్టిన చప్పట్లు, ఈలలు, కేకలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.



రాకెట్‌కు ఇరువైపులా బూస్టర్లు విడిపోతున్న దృశ్యం



రాకెట్‌కు రెండోదశ మండిన తరువాత విడిపోతున్న దృశ్యం



క్రయోజనిక్ (సీ-25) అంటే 25 టన్నుల సాయంతో చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి తీసుకెళుతున్న దృశ్యం



క్రయోజనిక్ దశతో 3,920 కిలోల బరువు కలిగిన చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెడుతున్న దృశ్యం

నేడు యువ ఉత్సవ్-2023

నెల్లూరు(మినీబైపాస్): నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లాస్థాయిలో యువ ఉత్సవ్-2023 పంచప్రణ్, ఇండియా-2047 కార్యక్రమాన్ని స్థానిక టౌన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ ఎ.మహేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు తదితరులు హాజరవుతారని తెలిపారు.

‘బాబు, పవన్‌లకు భయం పట్టుకుంది’

- పవన్‌ను పిచ్చాస్పత్రిలో చేర్పించాలి
- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇందుకూరుపేట: ‘సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. ఆయన్ను చూసి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు భయం పట్టుకుంది.’ అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొమరిక గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకు వలంటీర్లు ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని, వారిపై పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఆయన్ను పిచ్చాస్పత్రిలో చేర్పిస్తే మంచిదని సూచించారు. అతను చంద్రబాబు వద్ద ప్యాకేజీ తీసుకుని బతుకుతున్నాడని విమర్శించారు. చిరంజీవి మంచి మనసున్న వ్యక్తి అని, నెల్లూరులో ఎక్సైజ్ శాఖలో పనిచేసిన ఆయన తండ్రి చాలా మంచివారని కొనియాడారు. అలాంటి కుటుంబంలో పుట్టిన పవన్ వారికి చెడ్డపేరు తెస్తున్నాడన్నారు. బాబు ప్యాకేజీ పంపినప్పుడల్లా వారాహి ఎక్కి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడని, వారిద్దరూ ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజల మనసుల్లో నుంచి వైఎస్ జగన్‌ను చెరపలేవన్నారు. ఎమ్మెల్యేలు గ్రామాలకు వస్తే కూడళ్లలో, మరెక్కడైనా వేదికను ఏర్పాటు చేసి మాట్లాడడం, సమస్యలుంటే వారి దగ్గర వినతులు స్వీకరించడం వంటి కార్యక్రమాలు జరిగేవన్నారు. ఇందుకు భిన్నంగా నేరుగా గడప గడపకు వెళ్లడం, వారి సమస్యలు తెలుసుకోవడం, ప్రభుత్వం వల్ల కలిగిన ప్రయోజనాలు వివరించడం ఎప్పటి వరకు ఎక్కడా జరగలేదన్నారు. దేశంలో ఇంత పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌దేనన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఆయనకు పట్టం కట్టేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, నాయకులు గూడూరు ప్రభాకర్‌రెడ్డి, తిక్కవరపు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ వసుంధర, శివకుమార్‌రెడ్డి, బత్తిన సుమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేన అధ్యక్షుడిపై వలంటీర్ల ఆగ్రహం


ఏఎస్‌పేట ఏఎస్సైకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ, వలంటీర్లు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మర్రిపాడులోని మండల పరిషత్ కార్యాలయం నుంచి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వలంటీర్లకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, ఏపిలగుంట ఎంపీటీసీ నాయుడు హజరత్‌రెడ్డి తదితరులు మద్దతు తెలిపి మాట్లాడారు. పవన్ సినిమా డైలాగ్‌లకు చప్పట్లు కొట్టే స్థితిలో ప్రజలు లేరని, నోటికొచ్చినట్లు మాట్లాడితే చెప్పులతో బదులు చెబుతారని హెచ్చరించారు. వలంటీర్లు మాట్లాడుతూ ప్యాకేజీ స్టార్‌గా చెలామణిలో ఉన్న పవన్ కళ్యాణ్ రెండు అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసి ఓడిపోయిన అసమర్థుడన్నారు. పేదలకు సేవ చేస్తున్న తమను ఇష్టానుసారం మాట్లాడితే సహించబోమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రా నారాయణస్వామి, ఉర్లగంటి శ్రీనివాసులురెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుబ్బారావు, చిరంజీవి, దిద్దుగుంట జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాలి

అనుమసముద్రంపేట: పవన్ కళ్యాణ్ తమకు క్షమాపణ చెప్పాలని ఏఎస్‌పేట మండల గ్రామ వలంటీర్లు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం వలంటీర్లు ధర్నా నిర్వహించారు. వారికి మద్దతుగా ఏఎస్‌పేట ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి పాల్గొని మాట్లాడారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో వారు చేసిన సేవలను ప్రజలు మరిచిపోలేరన్నారు. అలాంటి వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. అనంతరం ఏఎస్సై నజీర్‌కు వినతిపత్రం అందజేశారు.

క్లుప్తంగా

నెల్లూరులో పశుగ్రాస వారోత్సవాలు


మాట్లాడుతున్న మహేశ్వరుడు

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో శుక్రవారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ జిల్లా అధికారి మహేశ్వరుడు మాట్లాడుతూ పశుగ్రాసం పెంపకంలో అన్నదాతలు మెళకువలు పాటించాలన్నారు. కొత్త రకాల పశుగ్రాసాలు పెంపకం ద్వారా లాభాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అధికారులు బీవీ సురేష్, రమేష్‌నాయక్, మాలకొండయ్య, టి.సోమయ్య, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించిన ప్రేమజంట


జడ్జి వాణి ఆధ్వర్యంలో పూలదండలు మార్చుకుంటున్న జంట

నెల్లూరు(లీగల్): వారిద్దరూ ప్రేమించుకున్నారు. వివాహానికి తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. దీంతో చట్టపరంగా ఒక్కటయ్యారు. వివరాలిలా ఉన్నాయి. పొదలకూరుకు చెందిన గంగవరం వేణుగోపాల్‌రెడ్డి కుమారుడు శివకృష్ణారెడ్డి, కొత్తూరు శాంతినగర్‌లో నివాసం ఉంటున్న తాత వెంకటేశ్వర్లు కుమార్తె మనోజ్ఞ నాలుగు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. వారి పెళ్లికి తల్లిదండ్రులు నిరాకరించారు. దీంతో వారు ఈనెల 12వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయి వివాహం చేసుకున్నారు. మనోజ్ఞ కనిపించలేదంటూ ఆమె తల్లిదండ్రులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారు. పోలీసులు శివకృష్ణారెడ్డికి ఫోన్ చేసి స్టేషన్‌కు రావాలని తెలియజేశారు. అతను భయపడి తను ప్రేమించిన మనోజ్ఞను తీసుకుని శుక్రవారం నేరుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి తమకు న్యాయం చేయాలని కోరారు. సంస్థ సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి ప్రేమజంటకు చట్టపరంగా వివాహం చేశారు. కార్యక్రమంలో లాయర్ సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

బండలు పడి కూలీ మృతి

పొదలకూరు: మండలంలోని మహ్మదాపురం గ్రామంలో భవనాన్ని తొలగిస్తుండగా కూలీపై బండలు పడి మృతిచెందాడు. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు.. దొడ్ల కుటుంబం ఏడు దశాబ్దాల క్రితం హాస్టల్ కాంప్లెక్స్‌ను నిర్మించింది. గతేడాది నార్త్, సౌత్ బ్లాకు పాత భవనాలను తొలగించి కొత్తగా భవనాలను నిర్మించి హాస్టల్ విద్యార్థులకు అందజేశారు. ఇదే క్రమంలో ఈస్ట్ బ్లాక్ భవనాలను కూడా తొలగించేందుకు సంగంకు చెందిన కాంట్రాక్టర్‌కు పని అప్పగించారు. ఆయన అదే గ్రామానికి చెందిన కూలీలను మాట్లాడుకుని పనులు చేయిస్తున్నాడు. శుక్రవారం పనులు జరుగుతుండగా కొమిరి వెంకటేశ్వర్లు (35) అనే కూలీలపై బండలు పడి అక్కడిక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై కరిముల్లా ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

రాష్ట్రంలో జనరంజక పాలన

- ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి జనరంజక పాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కుమ్మరకొండూరులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మేకపాటికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు నోటి జనార్దనరెడ్డి, సర్పంచ్ నోటి మల్లికార్జునరెడ్డి ఘన స్వాగతం పలికారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంజనేయస్వామి విగ్రహం వద్ద, శ్రీకోదండరామస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రాజగోపాల్‌రెడ్డి గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. సమస్యలు ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు ఏర్పాటు చేసి పాలనను ప్రజలకు చేరువ చేశారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని, రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, జిల్లా ప్రచార కార్యదర్శి బొల్లినేని వెంకటసత్యనారాయణ, నాయకులు మెట్టుకూరు భాస్కర్‌రెడ్డి, ములకా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి


సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ


నెల్లూరు(క్రైమ్): పోలీసు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహిస్తూ పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురావాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి సూచించారు. నెల్లూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీసు వెల్ఫేర్ డే కార్యక్రమం జరిగింది. వీఆర్, డిజార్జన్, సర్వీసు, అనారోగ్యం, బదిలీలు, పదోన్నతులు, క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన అర్జీలను సిబ్బంది నుంచి ఎస్పీ తీసుకుని పరిశీలించారు. వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, మహిళా కానిస్టేబుల్స్ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రమశిక్షణ, నిబద్ధతతో సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. అనధికారికంగా గైర్హాజరు, నిర్లక్ష్యంతో విధులు నిర్వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ డి.హిమవతి, డీపీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ అనుమానాస్పద మృతి

నెల్లూరు(క్రైమ్): అనుమానాస్పద స్థితిలో ఓ డ్రైవర్ మృతిచెందిన ఘటనపై నెల్లూరులో వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. పొదలకూరు రోడ్డు సమ్మర్ స్టోరేజ్ వీధిలో కోటేశ్వరమ్మ కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె రెండో కుమారుడు మహేష్ (32) నెల్లూరు మత్స్య శాఖ కార్యాలయంలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన బీవీనగర్ సప్తగిరికాలనీలో ఉంటున్న ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. తల్లి మందలించినా అతను వినిపించుకోలేదు. ఎప్పటిలాగే ఈనెల 13వ తేదీన మహేష్ తన తల్లి ఇంటి నుంచి విధులకు వెళ్లాడు. రాత్రి కుమారుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో కోటేశ్వరమ్మ ఫోన్ చేయగా జేడీ సార్‌తో ఉన్నానని ఆలస్యం అవుతుందని, ఆఫీసులోనే పడుకుంటానని చెప్పాడు. శుక్రవారం కోటేశ్వరమ్మ తన కుమారుడికి ఫోన్ చేయగా ఆఫీస్ నుంచి ఇంటికి వస్తున్నానని చెప్పాడు. ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో మహేష్‌తో సహజీవనం చేస్తున్న మహిళ నుంచి ఆమెకు ఫోన్ వచ్చింది. ఆ సమయంలో కోటేశ్వరమ్మ పనిలో ఉండడంతో చూసుకోలేదు. కొద్దిసేపటి తర్వాత ఫోన్ చూడగా మిస్డ్‌కాల్ ఉండడంతో ఫోన్ చేయగా మహిళ తమ్ముడు లిఫ్ట్ చేశాడు. బీవీ నగర్ దగ్గర నుంచి వచ్చే క్రమంలో విద్యుత్ వైర్ తగిలి మహేష్ షాక్‌కు గురయ్యాడని, కిమ్స్‌కు, అక్కడి నుంచి జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మహేష్ మృతిచెందాడని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న దీంతో బాధిత తల్లి ఆస్పత్రికి చేరుకుని కుమారుడి మృతదేహం చూసి కన్నీటి పర్యంతమైంది. తన కుమారుడి మృతికి సంబంధించి సదరు మహిళపై అనుమానం ఉందని కోటేశ్వరమ్మ వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీకేడబ్ల్యూలో 19 డిగ్రీ కోర్సులు

- 20 నుంచి ఆప్షన్ల నమోదు


బ్రోచర్లను విడుదల చేసిన ప్రిన్సిపల్, అధ్యాపకులు

నెల్లూరు(టౌన్): నెల్లూరు డీకేడబ్ల్యూ కాలేజీలో డిగ్రీలో 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించి 19 కోర్సులను ఆఫర్ చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గిరి తెలిపారు. శుక్రవారం కళాశాలలో కోర్సులకు సంబంధించి బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థినులకు డిగ్రీ, పీజీ కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. బీఏ హానర్స్‌లో మేజర్ సబ్జెక్టులో హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, స్పెషల్ తెలుగు, స్టాటిస్టిక్స్ (నాన్ మ్యాథ్స్) ఉన్నాయని చెప్పారు. పాసిబుల్ మైనర్ సబ్జెక్టులు ఆరులో ఒకటి తీసుకోవచ్చన్నారు. బీకాం హానర్స్‌లో జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్, బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ సబ్జెక్టులు ఉన్నాయని, మైనర్ సబ్జెక్టుగా కంప్యూటర్ అప్లికేషన్స్, కామర్స్ తీసుకోవచ్చన్నారు. బీఎస్సీ హానర్స్‌కి సంబంధించి మ్యాథ్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, జువాలజీ, బయో టెక్నాలజీ, ఆక్వా కల్చర్, బోటనీ, హోం సైన్స్, కెమిస్ట్రీతోపాటు మరో పది మైనర్ సబ్జెక్టులు ఉన్నాయన్నారు. చేరేందుకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముగిసిందని, ఈనెల 20వ తేదీ నుంచి విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలన్నారు. ఏపీ ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు విద్యార్థులకు ఆరునెలలపాటు ఇంటర్న్‌షిప్, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. వైస్ ప్రిన్సిపల్ రమణరావు, ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ ప్రసాద్, అధ్యాపకులు వింధ్యావళి, సాయిసుధా, విజయభాస్కర్ పీఆర్వో జోజి పాల్గొన్నారు.

పీడీపై దాడికి యత్నం

నెల్లూరు(క్రైమ్): పీడీ (ఫిజికల్ డైరెక్టర్)పై ఓ విద్యార్థి, అతని బంధువులు దాడికి యత్నించడమే కాకుండా చంపుతామని బెదిరించారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు పత్తేఖాన్‌పేట అరిగెలవారివీధికి చెందిన విజయ్‌కుమార్ పొదలకూరురోడ్డు జెడ్పీ హైస్కూల్‌లో పీడీగా పనిచేస్తున్నారు. ఈనెల 11వ తేదీన అదే స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి తోటి విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తుండడాన్ని విజయకుమార్ గమనించాడు. దీంతో సదరు విద్యార్థిని మందలించడంతో నన్నే హెచ్చరిస్తావా? నీ సంగతి తేలుస్తా అని అతను హెచ్చరించి వెళ్లిపోయాడు. 13వ తేదీ విజయకుమార్ విద్యార్థులకు డ్రిల్ క్లాస్ చెబుతుండగా పదో తరగతి విద్యార్థి తన బంధువులు మున్వర్, రషీద్‌ను స్కూల్ గ్రౌండ్ వద్దకు తీసుకొచ్చాడు. వారు పీడీపై దాడికి యత్నించారు. ఇంతలో సహచర ఉపాధ్యాయులు రావడాన్ని గమనించిన మున్వర్, రషీద్ పరారవుతూ స్కూల్ గార్డెన్ గ్రిల్స్‌ను పెరికివేసి వాటి గొలుసులను తెంపేశారు. మరోసారి మా వాడి జోలికివస్తే చంపుతామని బెదిరించారు. ఈ విషయాన్ని విజయకుమార్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి సూచనల మేరకు శుక్రవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): కుటుంబ కలహాలో? మరే ఇతర కారణమో స్పష్టంగా తెలియదు కానీ గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున నెల్లూరు వేదాయపాళెం రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. మృతుడి వయసు 30 నుంచి 35 ఏళ్లలోపు ఉంటుందని భావిస్తున్నారు. గుండు చేయించుకుని ఉన్నాడు. గోధుమ రంగు ప్యాంట్ ధరించాడు. కుడిచేతిపై అమ్మ, ఎడమచేతిపై జ్యోతి అని పచ్చబొట్టు ఉంది. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు నమోదు చేశారు. మృతుడి ఆచూకీ కోసం చుట్టుపక్కల గాలించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 124
లేయర్ (లైవ్)	: 92
బ్రాయిలర్ చికెన్	: 216
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 240
లేయర్ చికెన్	: 156

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.12
పండ్లు	: రూ.5



చెట్టును ఢీకొన్న ఆటో

- యువకుడి మృతి
- ముగ్గురికి తీవ్ర గాయాలు

కొండాపురం: చెట్టును ఆటో ఢీకొన్న ఘటనలో కొండాపురం మండలం ఆదిమూర్తిపురం గ్రామానికి చెందిన ఓ యువకుడు మృతిచెందిన ఘటన శుక్రవారం కలిగిరి మండలం కుడుములదిన్నెపాడు వద్ద జరిగింది. కలిగిరి, కొండాపురం ఎస్సైలు సూర్యప్రకాష్‌రావు, ఖాజావలీ తెలిపిన వివరాల మేరకు.. ఆదిమూర్తిపురానికి చెందిన నల్లమోతు అరవింద్ (22) తన తల్లిదండ్రులు సుబ్బారావు, సుమతితో కలిసి తిరుమలకు వెళ్లారు. దైవ దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో కలిగిరికి చేరుకున్నారు. అక్కడ రావులకొల్లుకు చెందిన ఆటోను బాడుగకు మాట్లాడుకుని సొంతూరికి బయలుదేరారు. ఆ సమయంలో అక్కడే ఉన్న చింతలదేవి గ్రామానికి చెందిన ఎలేసు అనే వ్యక్తి అదే ఆటో ఎక్కాడు. అందరూ కలిసి వెళ్తుండగా కుడుములదిన్నెపాడు సమీపంలో కుక్క ఎదురుగా రావడంతో డ్రైవర్ ఆటోను తప్పించబోయాడు. ఈ క్రమంలో రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొంది. దీంతో అరవింద్ అక్కడికక్కడే మృతిచెందాడు. అతని తల్లిదండ్రులు, ఎలేసు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి వారిని కలిగిరిలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అప్పటికే అరవింద్ మృతిచెందినట్లు డాక్టర్లు కూడా నిర్ధారించారు. అరవింద్ మృతదేహాన్ని బంధువులు స్వగ్రామానికి తరలించారు. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కలిగిరి ఎస్సై తెలిపారు.

అమెరికాకు వెళ్లాల్సి ఉండగా..

గ్రామంలో అరవింద్ ఉన్నత చదువుల కోసం ఈనెల 19వ తేదీన అమెరికాకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని మొక్కుబడి నిమిత్తం తిరుమలకు వెళ్లినట్లు తెలిసింది. అతని మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.